చిన్నకథ

# కష్టం తిన్నడేమో! రెక్కలున్నయిగా!

ఎలికట్టె శంకర్‌రావు

యవుసాయం జెయ్యటం మానాయిన దగ్గెర జూసి నేర్సుకోవలసిందే ఏ అంగడం నా కొడుకైనా. ఇరాం లేకుంట యేదో పనిజేస్తనే వుంటడు. ఆయిన గోల్లు గిల్లుకుంట కూసున్న శిడం గూడ సూడలేకపోయిన యీ కండ్లతోని.

ఏ తెల్లారుగట్లనో లేస్తడా- పల్పుతాడో, పగ్గమో పేనుకుంట కూసుంటడు. లేకపోతె యే శిబ్బో, సుట్టకుదురో, పొరకోగాని బలే నేర్పుగా అల్లుతుంటడు.

ఇంగ యవుసాయం పనులైతే అదీ యిదీ అని చెప్పేదేముంది? లేసిన కాన్నించి పంటశేల్ల కాలువెమ్మటో, కలుపెమ్మటో పడ్తడు తప్ప మల్ల యింటి మొకం చూడడు.

మాయమ్మ శిన్నాయిన కొడుకు రాఁవులు మాఁవ పొలం, మా పొలం పక్కన్నే వుంటది. ఆయిన వొట్టి వొల్లంగనోడు. కుండలో గుర్రాలు తోలే రకమన్నమాట. ఆయినకు తిండి మీదున్న యావ పనిమీదుంటాది? ఒట్టి కూటి ముచ్చునాయాలా.

'ఒసే లంజే! ఈ కూడెట్లమింగాల్నే అని శెవులటికె యెత్తేస్తోని తోని యెట్ల శెయ్యనమా సంసారం' అని మా అత్త లబోదిబో అనుకుంట రొండు దినాలకోసారన్నా బజారుకెక్కకపోతెనే యిచ్చిత్రపోవాలె.

అసుంటి మా మాఁవ పొలంల కలుపు, కామంచి గంటలు కట్టిందంటే కట్టదామరి!

'తిని దుప్పట్లె దూరిపోవటం కాదురా మొగతనమంటె. కడుపుకింత తిండిపెట్టే పంటను కన్నతల్లి కంటె యెక్కువ సూసుకోవాలె. సేద్యం జేస్తున్నమంటె తేటగ అద్దమోలిగ మెరవాలె పొలం. ఇగురం తప్పిన ముండ యవుసాయం జేసేదాని కంటె కులసంగం పెట్టుకొని అడ్కతినటం మేలు' అని ఒకటే దొబ్బుల బెట్టెటోడు మా నాయిన.

తొండలు గుడ్లుబెట్టేదైతేంది కాని మాకు నాలుగు సోట్ల కల్పి వో పన్నెండెకరాలు వుంది. (ఇదుండబటికే గదా మా నాయిన ఇల్లుటం వొచ్చింది?). యెల్గటి పంటలు అక్కరొచ్చినా రాకున్నా వున్నొక్క యెకరం పొలంల పండిందే మా యింటి రాజులకు బువ్వ. మా నాయిన పంట తీస్తుంటే సూసినోల్లు 'బర్రె జెనిగోలిగ పడతడయా పొలమెంట. కాల్ల సందున దూరినా లింగయ్య యీవురం రాదు యింకోనికి' అని మా బాగా మెచ్చుకుంటోల్లు.

ఒక్క యెకరాన్ని పట్టుకొని మూడు పంటలు తీసెటోడు మా నాయిన. అంతా ఆనకాలం, యేసంగితో సరిపుచ్చుకుంటే మా నాయిన మాత్తరం 'పిల్లలున్నరు తిండికి కావొద్దు? యెండని కాల్లు బార్ల సాపి కూసుంటె యెట్ల?' అని అగ్గి కురుస్తున్నా కత్తెర పొలం దున్నెటోడు.

ఆయిన కస్టాన్ని బూఁవమ్మ ఎప్పుడూ దాసుకోలె. మా యింట్లె రొండు గుమ్మల నిండుగా తిండిగింజలు నింతే పేడతో మెత్తేసేది మాయమ్మ.

మా నాయిన దోతి పైకి యెగకట్టి గోశిబెట్టి మడికట్లకు దిగిండంటే పొద్దే తెల్సేదికాదు. తోడంగి గంట యేరు కనపడ్డా సరే యేల్లు బురదలకు గుచ్చి కూకటేల్ల కాడికి పీకి వొరంమీద బోర్లేసి తొక్కెటోడు. పారబట్టి వొరం దీసుడు సురూ జేసిండంటె అవుతల మారుకు యెల్లి పోతెనే మల్ల లేసెటోడు. మా పొలంల వొరాలు సుగ సక్కగ, తేటగ గోడబెట్టినట్టు వుండేయి.

నిరుడు యాసంగి పూట సాలుసాగి వొల్లు దాసుకోకుంట నాగలెంట బడ్డడు మా నాయిన. తొలిసాలు యిరువాలు అని మడి సొంతం పెరుగుపెరుగు అయిందాంక వొదల్లే.

నారేసి, నాటుబెట్టిన కాన్నుంచి ఆయిన కండ్లు, కలలన్నీ పొలం మీదనే. మా నాయిన మాపటీలు యింటి పట్టున పండుకున్నా 'కట్టె మాత్తరమే యింట్లె గని ఎలికట్టాయిన పానం మొత్తం పొలంకాన్నే లేదు?' అనక వూకోలు యెవలైనా.

మరి కండ్లల్ల వొత్తులేసుకొని తిరగబటికే గదా ఆగన్ని లేవిడి నీల్లకు యెకరం పొలం పారుతుంది?

మా నాయిన కాలుతీరో యేమోగాని యెండ్రకిచ్చలు, యెలుకలు మా పొలం దిక్కుగూడ జూసేటియి గావు. అయినా అయి తిరగటానికి మా నాయిన సందిస్తెనా? రేయింబగుల్లు ఆటికంటె యెక్కువే యిరాం లేకుంట మా నాయినే తిరుగుతుండె.

పసుల పెంట, మూడు పదియేల్లు వూరియా యేస్తె మోకాలెత్తు యెదిగి పచ్చగ నిగనిగలాడేది పొలం. సంటిపిల్లకు పాలు తాపించినట్టు యాల్లమీద నీల్లు పెట్టెటోడు.

పొట్టల్నుంచి అప్పుడే బెయిటికొస్తున్న వారెన్నుల్ని నిమిరెటోడు. మా పావురంగా కండ్లకద్దుకుంటోడు.



మా నాయిన కస్టం వొరి కుంకులై దగదగా